క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌రూరల్: తెలంగాణ గిరిజన సంక్షేమ పురుషుల డిగ్రీ కళాశాల ఆదిలాబాద్‌లో కంప్యూటర్, డాటా సైన్స్ గెస్ట్ ఫ్యాకల్టీగా బోధించేందుకు ఫస్ట్ క్లాస్ పీజీతో పాటు సెట్, నెట్, పీహెచ్‌డీ, అనుభావం కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీ ప్రసన్న ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 14 నుంచి 18లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 98493 90495పై సంప్రదించాలన్నారు.

20న వేలం

బోథ్: బోథ్ జూనియర్ సివిల్ కోర్టు పాత భవనాన్ని ఇటీవల కూల్చివేశారు. కాగా భవనానికి సంబంధించిన పాత సామగ్రిని ఈనెల 20న మధ్యాహ్న 2 గంటలకు పాత కోర్టు ప్రాంగణంలో బహిరంగ వేలం వేయనున్నట్లు కోర్టు సిబ్బంది తెలిపారు. ఆసక్తి గల వారు రూ.10 వేలు డిపాజిట్ చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

కాంగ్రెస్ సోషల్‌మీడియా జిల్లా కోఆర్డినేటర్‌గా రమేశ్


బత్తుల రమేశ్

బోథ్: జిల్లా కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా సొనాల గ్రామానికి చెందిన బత్తుల రమేశ్ నియమితులైయ్యారు. ఈ మేరకు మంగళవారం కాంగ్రెస్ రాష్ట్ర సోషల్‌మీడియా కోఆర్డి నేటర్ నవీన్ పెట్టెం నియామకానికి సంబంధించి లేఖను విడుదల చేశారు. తనపై నమ్మకముంచి జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా నియమించినందుకు సీఎం రేవంత్ రెడ్డి, ని యోజకవర్గ ఇన్‌చార్జి ఆడె గజేందర్, చంటి, శ్రీధర్‌కు ధన్యవాదాలు తెలిపారు.

24న రజక సంఘం ఎన్నికలు

ఆదిలాబాద్‌రూరల్: రజక సంఘం ఆదిలాబాద్ పట్టణ కార్యవర్గం ఎన్నికలను ఈనెల 24న నిర్వహించనున్నట్లు రజక సంఘం అడహక్ కమిటీ సభ్యులు మల్‌కుల్‌వార్ సంతోష్, నరేందర్‌లు తెలిపారు. బుధవారం ఆదిలాబాద్ పట్టణంలోని రజక సంఘ భవనంలో మాట్లాడారు. పట్టణంలోని రజకులు ఈ విషయాన్ని గమనించి అడహక్ కమిటీ సభ్యులకు సహకరించి ఎన్నికలను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సభ్యులు భూమన్న, రాజేశ్వర్, జ్ఞానేశ్వర్, అశోక్, లింగన్న, తదితరులు పాల్గొన్నారు.

పక్షులను సంరక్షించుకోవాలి

ఆదిలాబాద్‌టౌన్: పక్షులను పరిరక్షించుకోవాలిసిన బాధ్యత అందరిపై ఉందని పక్షి ప్రేమికుడు జక్కుల వెంకటేశ్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని అర్బన్ కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం, పాత హౌజింగ్‌బోర్డు కాలనీలోని శ్రీ సరస్వతి శిశు మందిర్‌లో బర్డ్స్ ఫీడర్లను అందజేశారు. వేసవిలో పక్షులకు ఆహారం, నీటిని అందించాలని కోరారు. ప్రకృతి స్నేహంతో మానసిక ఒత్తిడి తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రత్యేకాధికారి దీప్తి, విద్యార్థులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు

ఆదిలాబాద్‌టౌన్: నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ టి.సుజాత ఒక ప్రకటనలో తెలిపా రు. తెలంగాణ కార్మిక, ఉపాధి శిక్షణ, కార్మాగారశాఖల ద్వారా రిక్రూట్‌మెంట్ చేపడుతున్నారని పేర్కొన్నారు. ఇజ్రాయిల్ దేశంలో నిర్మాణ కార్మికులు, షట్టరింగ్, కార్పెంటర్లు, సెరామిక్ టైలింగ్, ప్లాస్టరింగ్, ఐరన్ బెండింగ్ పనిచేసేందుకు నిరుద్యోగులు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులు ఎస్సెస్సీ ఉత్తీర్ణులై ఉండాలని, మూడు సంవత్సరాల పని అనుభవం కలిగి ఉన్నవారు అర్హులని పేర్కొన్నారు. వివరాలకు 99854 83931, 82478 38789 సంప్రదించాలని కోరారు.

మొక్కల పెంపకంపై శ్రద్ధ పెట్టాలి


నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీవో మోహన్‌రెడ్డి

తాంసి: ఎండల తీవ్రత అధికంగా ఉన్నందున నర్సరీలో మొక్కల పెంపకంపై శ్రద్ధ పెట్టాలని ఎంపీడీవో మోహన్ రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని వడ్డాడి గ్రామంలో నర్సరీని పరిశీలించారు. మొక్కల పెంపకం కోసం చేపట్టిన జాగ్రత్తలను పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం అంగన్‌వాడీని తనిఖీ చేశారు. వారి వెంట ఎంపీవో స్వప్నశీల, పంచాయతీ కార్యదర్శి అజయ్, ఫీల్డ్ అసిస్టెంట్ నర్సింగ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా భీమన్న జాతర

బోథ్: మండలంలోని నారాయణపూర్ పరిధిలో భీమన్న జాతరను ఘనంగా నిర్వహించారు. మండలంలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు వందలాదిగా తరలివచ్చారు. అనంతరం భీమన్న దేవుడిని దర్శించుకొని, ప్రత్యేక పూజలు చేశారు.

కూలీలకు సౌకర్యాలేవి?

- ఎండలోనే ఉపాధిహామీ పనులు
- క్షేత్రస్థాయిలో ఇబ్బంది పడుతున్న కూలీలు
- పట్టించుకోని ప్రభుత్వం


పనులు చేస్తున్న ఉపాధిహామీ కూలీలు

ఆదిలాబాద్‌రూరల్: దిన దినం ఎండలు మండిపోతున్నాయి. మార్చి ప్రారంభంలోనే భానుడు తన ప్రతాపం చూపుడుతున్నాడు. ప్రస్తుతం వ్యవసాయ పనులు లేకపోవడంతో వ్యవసాయ కూలీలు ఉపాధిహామీ పనులకు వెళ్లేందుకు మొగ్గు చూపుతున్నారు. గతంలో వేసవి కాలంలో కూలీలకు క్షేత్రస్థాయిలో కనీస సౌకర్యాలు కల్పించే వారు. ప్రస్తుతం జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం పనులకు వెళ్లే కూలీలకు క్షేత్రస్థాయిలో సౌకర్యాలు కరువయ్యాయి. రోజు రోజుకూ ఎండ తీవ్రత పెరగడంతో ఉపాధి పనులకు వెళ్లేందుకు కూలీలు జంకుతున్నారు. రానున్న రోజుల్లో కూలీల సంఖ్య మరింత తగ్గే అవకాశం ఉందని కూలీలు పేర్కొంటున్నారు. అలాగే ఎండ దెబ్బకు కూలీ మృతి చెందే అవకాశం ఉందని పలువురు కూలీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కూలీలు ఇలా..

ఆదిలాబాద్ రూరల్ మండలంలో 15,400 జాబ్ కార్డులు ఉండగా 8,300 మంది కూలీలు జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం పనులకు వెళ్తున్నారు. మావల మండలంలో 3,347 జాబ్ కార్డులు ఉండగా 4,949 మంది కూలీలు పనులకు వెళ్తున్నారు. గతంలో ఉపాధిహామీ కూలీలకు ప్రభుత్వం క్షేత్రస్థాయిలో వివిధ రకాల సౌకర్యాలు కల్పించేవారు. ప్రస్తుతం వీరికి సౌకర్యాలు కల్పించకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

పరికరాలు లేవు.. డబ్బులు లేవు..

గతంలో 2007లో కూలీలకు గడ్డ పారలు అందించారు. గతంలో గ్రూపుకో ఒక మెడికల్ కిట్, గ్రామ పంచాయతీకో టెంటు ఇచ్చారు. గత కొన్నేళ్ల నుంచి కూలీలకు ఇప్పటి వరకు ఎలాంటి పరికరాలు అందించడం లేదు. పరికరాల బదులు గతంలో కూలీ సొంతంగా గడ్డపార సమకూర్చుకుంటే రోజుకు రూ. 10 వేతనంతో కలిపి ఇచ్చే వారు. అలాగే తాగు నీటికి లీటర్‌కు రూ. 2 అందించేవారు. అయితే కూలీల వేతనాలు రెండేళ్ల కిందట నుంచి కేంద్ర సర్వర్‌కు అనుసంధానం చేయడంతో అప్పటి నుంచి తాగునీటికి, పరికరాలకు సంబంధించి డబ్బులు సైతం ఇవ్వడం లేదని కూలీలు వాపోతున్నారు. దీంతో కూలీలు పనులకు వెళ్లేందుకు వెనుకడుగు వేస్తున్నారు. మరో పక్క ఎండకు వడదెబ్బకు గురయ్యే పరిస్థితి ఉంది.

కనీసం గ్రీన్‌మ్యాట్ వేయాలి



ప్రస్తుతం వ్యవసాయ పొలాల్లో కూలీ పనులు అంతంత మాత్రంగానే ఉన్నాయి. దీంతో ఉపాధిహామీ పనులకు వెళ్తున్నా. కొన్నేళ్ల కిందట కూలీ పనులకు వెళ్తే టెంటు, తాగేందుకు నీరు, గడపార ఇచ్చేవారు. ప్రస్తుతం ఏం ఇవ్వడం లేదు. కొంత సేపు రెస్ట్ తీసుకునేందుకు గ్రీన్ మ్యాట్ వేయాలి.

– సిడాం లచ్చుబాయి, ఉపాధిహామీ కూలీ

ఇబ్బంది పడుతున్నాం



ఎండలు దాంచికొడుతున్న ఉపాధి హామీ పనులకు వెళ్తున్నా. పని ప్రదేశంలో ప్రస్తుతం ఎలాంటి సౌకర్యాలు లేవు. ఇబ్బంది పడుతున్నప్పటికీ పనులకు వెళ్లాల్సి వస్తోంది. గతంలో మాదిరిగా ఓఆర్‌ఎస్ పౌడర్, తాగేందుకు నీళ్లు, గడ్డపార వంటివి సౌకర్యాలు కల్పిస్తే బాగుంటుంది.

– మడావి రాజు, ఉపాధిహామీ కూలీ

ఎలాంటి ఆదేశాలు లేవు



కూలీలకు గత కొన్నేళ్ల నుంచి క్షేత్రస్థాయిలో నీడను కల్పించేందుకు టెంటు, తాగు నీటి సరఫరా చేయాలని, మెడికల్ కిట్‌లు సమకూర్చాలని ఎలాంటి ఆదేశాలు లేవు. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వస్తే తప్పకుండా కల్పిస్తాం.

– జాకీర్ హుస్సేన్, ఏపీవో, ఎన్ఆర్‌ఈజీఎస్, ఆదిలాబాద్

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి


అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ ఉమారాణి

సిరికొండ: గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని వాయిపెట్ సెక్టర్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విమల అన్నారు. పోషణ పక్షం వారోత్సవాల్లో భాగంగా బుధవారం మండలంలోని మల్లాపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో బాలింతలు, గర్భిణులకు ఎండకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. పుట్టిన బిడ్డకు తప్పకుండా ముర్రుపాలు పట్టాలన్నారు. అంగన్‌వాడీ టీచర్ అంజలి, ఏఎన్‌ఎం దేవిక, ఆశ వర్కర్ సునీత పాల్గొన్నారు.

ఇచ్చోడ: అంగన్‌వాడీల ద్వారా పిల్లలకు, బాలింతలకు, గర్భిణులకు పోషకాహారం అందిస్తున్నట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉమారాణి అన్నారు. బుధవారం మండంలోని జామిడి అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన పోషణ పక్షోత్సవాల్లో పాల్గొని మాట్లాడారు. పోషణ పక్షోత్సవాల్లో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త, బాలింతలు, గర్భిణులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడిపై అప్రమత్తంగా ఉండాలి


మాట్లాడుతున్న ఎంపీపీ జ్ఞానోబా


మాట్లాడుతున్న ఎంపీడీవో మహేందర్‌కుమార్

బేల: గ్రామాల్లో తాగునీటిపై అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో మహేందర్‌కుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశ మందిరంలో తాగునీటి ఎద్దడిపై ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఎండకాలం దృష్ట్యా ముందస్తుగా తాగునీటి సమస్యను గుర్తించాలని, వెంటనే గ్రామీణ నీటిపారుదల శాఖ ఏఈ శాంతికుమార్‌కు నివేదించాలని సూచించారు. పైప్‌లైన్ లీకేజీల మరమ్మతులు, చేతిపంపులు మరమ్మతులు చేయాలన్నారు. సమావేశంలో ఎంపీవో మహేశ్‌కుమార్, వాటర్‌గ్రిడ్ ఏఈ రాహుల్, తదితరులు పాల్గొన్నారు.

గుడిహత్నూర్: గ్రామాల్లో నీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలని ఎంపీపీ జ్ఞానోబా అన్నారు. ఎంపీపీ సమావేశ మందిరంలో ప్రత్యేక సమావేశం నిర్వహించి ఎంపీడీవోకు పలు సూచనలు చేశారు. నీటి ఎద్దడి గ్రామాలను గుర్తించి ప్రత్యామ్నయంగా బోరు బావులు వేసి నీటి కష్టాలు తీర్చాలన్నారు. ఉన్న బోరుబావులకు మరమ్మతులు చేయించి వినియోగంలోకి తేవాలని సూచించారు. మండలంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను ఎంపీటీసీ సభ్యులు నివేదించడంతో అధికారులు నమోదు చేసుకున్నారు. ఆయా పనులు త్వరలో చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. కోఆప్షన్ సభ్యుడు జమీర్, ఎంపీడీవో మహమ్మద్ అబ్దుల్ హై, ఎంపీటీసీలు షగీర్ ఖాన్, అంకతి సవిత, కోవ తులసీ, తదితరులు పాల్గొన్నారు.

ఇంటి స్థలాలకు పట్టాలు అందించాలి

కైలాస్‌నగర్: జిల్లా కేంద్రంలోని న్యూ హౌజింగ్ బోర్డు సమీపంలోని సర్వే 72లో నివాసం ఉంటున్న ఆదివాసీల ఇంటి స్థలాలకు వెంటనే పట్టాలు అందించాలని తుడుందెబ్బ జిల్లా నాయకులు గణేశ్ డిమాండ్ చేశారు. సర్వే 72లోని ఆదివాసీలతో కలిసి బుధవారం కలెక్టరేట్ ఎదుట నోటికి నల్ల గుడ్డాలు కట్టుకుని మౌన పోరాటం చేశారు. ప్లకార్డులు చేతపట్టుకుని తమ నిరసన వ్యక్తం చేశారు. 72లోని ఆదివాసీలకు పట్టాలు అందించడమే కాకుండా, కనీస మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఇందులో తుడుందెబ్బ నాయకులు, ఆదివాసీలు పాల్గొన్నారు.

సీసీరోడ్డు నిర్మాణానికి భూమిపూజ

బోథ్: మండలంలోని చింతల్‌బోరి గ్రామంలో ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సహకారంతో ఉపాధిహామీ పథకంలో భాగంగా రూ. 3 లక్షల నిధులతో నిర్మించే సీసీరోడ్డు పనులకు ఎంపీటీసీ జాదవ్ సునీత రోహిదాస్ బుధవారం భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ముండె ఈశ్వర్, డిగోలె ఇస్సు, సంతోష్, శ్రీధర్, విజయ్, ఆత్మ రాం, సత్యనారాయణ, సుదర్శన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఆందోళనకు గురికావద్దు


అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి

సిరికొండ: పరీక్ష సమయంలో విద్యార్థులు ఆందోళనకు గురికావద్దని రిమ్స్ ఆస్పత్రి మానసిక వైద్యుడు ఓం ప్రకాష్, ఎస్సై నవీన్‌లు అన్నారు. బుధవారం సిరికొండ కస్తూరిబా గాంధీ బాలిక విద్యాలయంలో పదో తరగతి విద్యార్థినులకు పరీక్ష సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఏమైనా సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌వో సంధ్యారాణి, ఏఎస్సై రమేశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా మొల్లమాంబ జయంతి


నివాళులర్పిస్తున్న కుమ్మరిసంఘం నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: తొలితెలుగు మహిళా కవయిత్రి అతుకూలి మొల్లమాంబ జయంతిని బుధవారం జిల్లా కేంద్రంలోని కుమ్మర సంఘ భవనంలో ఘనంగా నిర్వహించారు. ఆమెచిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘం జిల్లా అధ్యక్షుడరు కన్నం మోహన్ బాబు, బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నూటెంకి సత్యనారాయణ మాట్లాడుతూ.. ఆనాటి కాలంలో మహిళల్లో అభ్యుదయ భావాలు కలిగించిన మాతృమూర్తి అని కొనియాడారు. ఆమె జయంతికి ప్రభుత్వం నిధులు కేటాయించి అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కుమ్మర కులస్తులు నిమ్మలూరి శ్రీనివాస్, నరసింహులు, కొండపర్తి అశోక్, గంగారాం, శంకర్, విఠల్, చందు, సత్యనారాయణ, మనోజ్, దేవన్న పాల్గొన్నారు.

బిడ్డకు తల్లిపాలే అందించాలి


ఆహారం తినిపిస్తున్న అంగన్‌వాడీ టీచర్

ఎదులాపురం: చంటి పిల్లలకు ఆరు నెలల వరకు తల్లిపాలు అందించాలని, ఆ తర్వాతే అదనపు ఆహారం ఇవ్వాలని సుందరయ్య అంగన్‌వాడీ కేంద్రం టీచర్ రాధ అన్నారు. సెంటర్ పరిధిలో ఆరు నెలలు నిండిన చిన్నారులకు బుధవారం సామూహిక అన్నప్రాసన నిర్వహించారు. ఆరు నెలల తర్వాత పిల్లలకు అదనపు ఆహారం అందించాలని, బాలామృతం ఇవ్వాలని సూచించారు. ఇందులో ఆశలు రాజునా, స్వప్న, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

అభివృద్ధికి పునాది చదువు


అవగాహన కల్పిస్తున్న అధ్యాపకులు

ఉట్నూర్‌రూరల్: అభివృద్ధికి పునాది చదువు అని గిరిజన మహిళా డిగ్రీ కళాశాల అధ్యాపకులు బుర్ర మానస, సుగుణ, మంజుల అన్నారు. ప్రిన్సిపాల్ బానోత్ హరిత ఆదేశాల మేరకు బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో విద్యార్థులో కలిసి పర్యటించారు. బాలికలు బాగా చదుకొని జీవిత లక్ష్యాలను సాధించాలన్నారు. నేడు సమాజంలో మహిళలు సైతం మగవారితో సమానంగా రాణించడం జరుగుతుందన్నారు. ఇదే స్ఫూర్తితో ప్రతిఒక్కరూ ముందుకు సాగాలన్నారు.

విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి


పరీక్ష సామగ్రి పంపిణీ చేస్తున్న గంగాధర్

ఆదిలాబాద్‌రూరల్: ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని భీంసరి ఎంపీటీసీ బిక్కి గంగాధర్ ఆకాంక్షించారు. బుధవారం మండలంలోని భీంసరి, చాందా (టి), అంకోలి గ్రామాల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో నిష్ణాతులైన ఉపాధ్యాయులతో విద్య బోధన చేయడం జరుగుతుందన్నారు. ఉపాధ్యాయులు బోధించే పాఠ్యాంశాలను ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బోథ్: మండలంలోని మోడల్ స్కూల్ పదో తరగతి విద్యార్థులకు స్థానిక హోంగార్డు బూస లక్ష్మణ్ పరీక్ష ప్యాడ్‌లు అందజేశారు. వీటిని సీఐ రమేశ్ చేతుల మీదుగా బుధవారం పంపిణీ చేశారు. విద్యార్థులు ఎలాంటి ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయాలని సీఐ సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఉమేశ్ రావు, సిబ్బంది పాల్గొన్నారు.

పరీక్ష సామగ్రి పంపిణీ

నేరడిగొండ: మండలంలోని కుంటాల(కె) ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు వెంకటాపూర్ ముత్యాలి బాయి హమ్ము నాయక్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. సొసైటీ సభ్యుడు, వెంకటాపూర్ మాజీ సర్పంచ్ ఆడే గంగారాం నాయక్ మాట్లాడుతూ.. విద్యార్థులు కష్టపడి చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాపురావు, ఉపాధ్యాయులు రాజేశ్వర్, మోతిలాల్, భీమ్‌రావు, రమేశ్, జ్యోతిరామ్, శంకర్, శశికాంత్, విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి


మాట్లాడుతున్న వెంకట్ నారాయణ

ఎదులాపురం: కేంద్ర ప్రభుత్వం రైతులకి ఇచ్చిన హాహామీలను వెంటనే అమలు చేయాలని అలాగే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్ నారాయణ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని కుమురంభీం భవనంలో బుధవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఆరు నెలల్లో రైతాంగ సమస్యలు పరిష్కరిస్తానని లిఖితపూర్వకంగా హామీ ఇచ్చి రెండేళ్లు అవుతున్నా అమలు చేయడం లేదన్నారు. హామీలు, రైతుల సమస్యల పరిష్కారం కోసం లక్షలాది మంది హర్యానా రైతులు ఢిల్లీకి శాంతియుత యాత్ర చేస్తుండగా వారిపై భాష్పవాయువు ప్రయోగించి, తుపాకులతో కాల్చి గాయపర్చడం మోదీ నిరంకుశ పాలన, రైతాంగ వ్యతిరేకతకు నిలువెత్తు నిదర్శనం అన్నారు. ప్రభుత్వ తీరును ఎండగడుతూ, కనీస గిట్టుబాటు ధర, కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో గురువారం నిర్వహించ తలపెట్టిన ఆందోళన కార్యక్రమాల్లో కార్మికులు, రైతులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాని పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా నాయకులు గొరాల సుభాశ్, శేషరావు, నర్సింగ్, జనార్దన్, దేవిదాస్, గణేశ్, తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ ఏర్పాటు అభినందనీయం


సీఎం ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: వ్యవసాయంపై ఆధారపడి జీవనం కొనసాగిస్తున్న మున్నూరుకాపు కులస్తుల సంక్షేమం, అభివృద్ధికి మున్నూరుకాపు కార్పొరేషన్ ఏర్పాటు చేయడం అభినందనీయమని ఆదిలాబాద్ తాలూకా మున్నూరుకాపు సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విఠల్, శ్రీనివాస్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రుల ఫ్లెక్సీలకు క్షీరాభిషేకం చేశారు. మున్నూరుకాపులు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని నిరంతరం చేసిన పోరాటాల ఫలితంగా కాంగ్రెస్ ప్రభుత్వం కార్పొరేషన్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో నాయకులు జైపాల్, శంకర్, సంతోష్, మధు, వెంకటి, సురేశ్, ప్రభ, జోగు రమణి, సంధ్య, సుధా రాణి, మౌణిక, సౌజన్య పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

బోథ్: కాంగ్రెస్ ప్రభుత్వం పద్మశాలి కార్పొరేషన్ ఏర్పాటుకు నిర్ణయం తీసుకోవడం పట్ల సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి బోథ్ మండల పద్మశాలి సంఘం నాయకులు బుధవారం క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షుడు మెరుగు భోజన్న, ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్, ఉపాధ్యక్షుడు కిరణ్ కుమార్, వడ్లకొండ సురేందర్, గంగుల రాజన్న, గుండు మల్లేష్, కట్కం రాజేంద్రప్రసాద్, ఆడెపు శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎదులాపురం: రాష్ట్ర ప్రభుత్వం ముదిరాజ్ కార్పొరేషన్ ఏర్పాటు చేయడంపై హర్షం వ్యక్తం చేస్తున్నట్లు తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర నాయకులు శివయ్య తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం మాట్లాడారు. వెంటనే కార్పొరేషన్ విధివిధానాలను అమలు చేయాలని, చైర్మన్‌ను నియమించాలని డిమాండ్ చేశారు. ముదిరాజ్‌లను బీసీడీ నుంచి బీసీఏలోకి మార్చాలని కోరారు.

ఎదులాపురం: రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేస్తూ రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని సంఘ భవన ఆవరణలో బుధవారం సీఎం ఫ్లెక్సీని క్షీరాభిషేకం చేశారు. ఇందులో రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నల్లా నారాయణరెడ్డి, గోపిడి రాంరెడ్డి, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న యూత్‌పార్లమెంట్


మాక్ పార్లమెంట్‌లో పాల్గొన్న విద్యార్థులు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలలో యూత్ పార్లమెంట్ కార్యక్రమాన్ని నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. పార్లమెంట్‌ను తలపించే విధంగా సెట్టింగ్‌తో ఏర్పాటు చేశారు. విద్యార్థులు అధికార, ప్రతిపక్ష నేతల పాత్రలను పోషించారు. సభకు రాష్ట్రపతి రాక, జాతీయ గీతాలాపన ఆకట్టుకుంది. అనంతరం సభ్యులు సమస్యలను లేవనెత్తుతూ పార్లమెంట్‌లో సమస్యలపై చర్చించే విధంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా శిక్షణ సహాయ కలెక్టర్ వికాస్ మహతో మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎన్‌వైకే కోఆర్డినేటర్ సుశీల్, కళాశాల ప్రిన్సిపాల్ అనిత, విద్యార్థులు పాల్గొన్నారు.

ముగిసిన బాజీరావుబాబా సప్తాహం


పూజలు చేస్తున్న భక్తులు

బేల: మండలంలోని దహెగాం గ్రామంలో వారం రోజులుగా కొనసాగుతున్న ఆధ్యాత్మిక గురువు బాజీరావు బాబా సప్తాహ ముగింపు వేడుకలు బుధవారం ముగిశాయి. ఈ సందర్భంగా స్థానిక ప్రధాన వీధుల గుండా పల్లకీని ఊరేగించారు. భజన, కీర్తనల మధ్యన శోభాయాతని నిర్వహించారు. అనంతరం భక్తులకు ఆధ్యాత్మిక ప్రవచనాలు బోధించారు. కాలదహీ హండీ నిర్వహించి, అన్నదానం చేశారు.